# పెండ్లి

సుంకోజి దేవేంద్రాచారి



## నిశ్చితార్థం


''ఏరా ఎంగటేశూ... నిన్ను రమ్మనింది ఎప్పుడ్రా?'' అరిచాడు సిద్ధారెడ్డి.

నేల చూపులు చూస్తా తలగోక్కుంటా నిలబడుకున్నేడు ఎంగటేశు.

''అక్కరయితే నూర్లకునూర్లు డబ్బు కావాలని వస్తారు, పని ఉండాది పద్దన్నే రాండిరా అంటే రారు...పోపో..పొయ్యి వంటోళ్లకు సాయం చేయిపో''

పరుగులాంటి నడకతో వంటలు తయారవుతున్న చోటుకు పోయాడు ఎంగటేశు.

వంద అంకణాల ఇల్లది. మొదటి అంతస్తు ఉంది. ఇంటి చట్టూ ఎకరా స్థలంలో ప్రహరీ గోడ. ఆ స్థలం మధ్యలో ఇల్లు. ఇంటికి నాలుగువైపులా నాలుగు ద్వారాలు. ఆగ్నేయమూలగా ఖాళీషెడ్డు. అందులోనే కారు, బైక్, ట్రాక్టర్లు ఉన్నాయి. మిగిలిన స్థలమంతా పూలచెట్లు. ఇంటికి ఉన్న నాలుగు ద్వారాలకు అనుగుణంగా తోటలోకి సిమెంట్ దారి. దారికి ఇరువైపులా రకరకాల పూలమొక్కలు. మధ్యలో పచ్చిక. ఆ ఇల్లు సినిమా సెట్టింగ్ మాదిరిగా ఉంటాది. వందమంది బంధువులు వచ్చినా ఏ ఇబ్బందీ లేకుండా ఉండచ్చు.



ఇంటి ముందున్న ఖాళీస్థలమంతా షామి యానాలు వేశారు. ఎడమవైపున షామియానా కింద బెంగుళూరు నుంచి వచ్చిన వంటవాళ్లు పదిమంది వంటపనిలో ఉన్నారు. వారికి ఆ వూరివాళ్ళు మరో పదిమంది సాయం చేస్తున్నారు. వాళ్లతో కలిశాడు ఎంగటేశు.

ప్రహరీ గోడకున్న ప్రధాన గేటు దగ్గర కుర్చీలో కూర్చుని ఉన్నాడు సిద్ధారెడ్డి.

సమయం ఎనిమిది గంటలు కావస్తాఉంది. మబ్బులు లేని ఆకాశంలో సూర్యుడు ప్రకాశవంతంగా ఉన్నాడు. మార్చినెల ఆఖరు కావడంతో గాలి వీస్తున్నా ఉక్కగానే ఉంది. ముందురోజే వచ్చిన బంధువులతో ఇల్లంతా సందడిగా ఉంది.

''బంధువులందరూ వచ్చేసినారా?'' నాగిరెడ్డి పలకరించినాడు లోపలికి వస్తా.

''ఈ వూర్లో ఉండేవోళ్లే ఇయ్యాలకు వస్తాంటే బయటూర్లనుంచి అప్పుడే వస్తార'' నిష్టూరంగా అన్నాడు సిద్ధారెడ్డి.

''రాత్రి నువ్వు ఫోన్ చేసి చెప్పినావా.. పద్దన్నే రావాలనుకుంటి. షాపు తెరకుండా వచ్చేస్తే పిల్లగాడు లేటుగా తీస్తాడు. పద్దన్నే వోని ఇంటికి పోయి వోన్ని నిద్ర లేపి పిల్చుకోనొచ్చి, షాపు తీసి వస్తాండా'' తన ఆలశ్యానికి సంజాయిషీ యిచ్చుకున్నాడు నాగిరెడ్డి.

''రా..కుచ్చో..ఎంగటేశూ..కాఫీ ఒగగ్లాసు తేరా.. బండిలో రాలేదేమి.. ఒగనివే వచ్చినావూ..''

''బండి ఇంటికాన్నే పెట్టేసి వచ్చినా., పద్దన్నే నడిసినట్టు ఉంటాదని. పిల్లోడు. మీ మరదలు బండిలో వస్తారు.'' కుర్చీలో కూర్చుంటా బదులిచ్చాడు నాగిరెడ్డి.

''వూర్లో మన బంధువులందరికీ చెప్పినా.. బయటూర్లలో ఉండే ముఖ్యమయిన బంధువులకూ చెప్పినా..ఇంగా చానామంది రావల్ల''

''నిశ్చితార్థానికే ఎందుకన్నా అందరికీ చెప్పినావు ..పెండ్లికి చెప్పాల.. రెండుసార్లు ఖర్చుకదా..'' ఎంగటేశు తెచ్చిన కాఫీ తాగతా అడిగినాడు నాగిరెడ్డి.

''ఖర్చుకానీలేప్పా..ఇంగెవురికి ఖర్చు చేయల్ల. ఉండేది ఒగబిడ్డ.''

''పిల్లోడోళ్లు ఉండేవాళ్లేనా''

''మనంత కాదు.. బాగుండేవాళ్లే.. వాళ్లకూ ఒగడే కొడుకు.. ఇంజనీరింగ్ చదివినాడు.. తొందర్లో అమెరికా పోతాండాడు.''

''అయితే మనపాప కూడా అమెరికా పోతాదా.''

''అంతేగదా.. మొగుడొగతావన, భార్యొగ తావన ఉంటారా? అమెరికా పోతాండాడనే మన బిడ్డను ఇస్తాండేది. ఈ వూర్లల్లో ఉండే వాళ్లయితే ఎంతమంది లేరు?''

''కట్నం ఏమాత్రం ఇస్తాండారు?''

''వోళ్లేమో దండిగానే అడిగినారప్పా.. నేను ఒగటే మాట చెప్పినా.. మీరడిగినంత కట్నం ఇస్తా.. మాకు పీలేర్లో ఒడ్ల మిషనుండాది. ఒగ సినిమా

హాలుండాది. నాలుగు ఇండ్లుండాయి. రెండంగళ్లు ఉండాయి. ఇయ్యన్నీ ఏమీ వద్దా మళ్లా.. అని అన్నే'' అంటా పకపకా నవ్వినాడు సిద్దారెడ్డి.

ఆయన నవ్వుకు జతకలిపాడు నాగిరెడ్డి.

గేటుదగ్గరకు వచ్చిన కుక్కలను ''హుష్.. హుష్..'' అంటా తరిమి సిద్దారెడ్డి తిరిగి మాట్లాడడం మొదలు పెట్టాడు ''అట్లంటే ఎట్ల బావా''.. అని నసిగే పిల్లోని చిన్నాయన. ముప్పై లక్షల క్యాష్, కేజీ బంగారం, ఒక కారు, పెండ్లి మనం చేసిచ్చేటిగా ఖరారు చేసుకున్నాం''

''ఆహా.. ఇంతకట్నం ఈ వూర్లో ఇంతవరకూ ఎవ్వరూ ఈలేదన్నా..''

''వుండే సొమ్మంతా నెత్తికెత్తుకోని పోతామా.. మన బిడ్డకే కదా ఇస్తాండాం..''

''ఏంబా..నువ్వీడ కుచ్చోనుండావు..వాళ్లేమో నాదగ్గరికి వచ్చి అడగతాండారు.. చక్కెర చాల్లేదంట..'' పద్మావతమ్మ వచ్చి చెప్పింది.

''దానికి మళ్లా నాకాడికి రావాల్నా.. ఎంతకావాల్నో ఎవురినయినా మనిషినంపిచ్చి తెప్పించు''

''ఏం నాగిరెడ్డి.. మా ఇంటికళ్లా వచ్చేదే మానుకున్నేవే..నేను పోతాండా..పనుండాది'' అంటా నాగిరెడ్డి సమాధానం కోసం ఎదురు చూడకుండా పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది పద్మావతమ్మ.

వంటలు తయారవుతున్న వైపు పరిశీలనగా చూశాడు నాగిరెడ్డి.

''చానామంది వంటలు చేస్తాండారు కదాన్నా.. ఎంతమందికి.''

''ఐదునూర్లమందికి చేసిస్తాడామప్పా..''

''అంతమందికా..!''

''ఆడ చూస్తాండావు కదా.. వంటపనిచేసే తావన్నే ఇరవైమందికి పైగా ఉండారు. వూర్లో మన బంధువులందరికీ చెప్పిండాము.. బ్యాండ్ సెట్ వస్తాది. వాళ్ళేగ ఇరవైమంది.''

''పెళ్లికొడుకోళ్లు ఎంతమంది వస్తారు..''

''వాళ్లా.. దూరంకదా.. రెండు టాటా సుమోళ్లో వస్తామన్నేరు. ఇరవైమంది ఉంటారేమో..మనం ఉండూరోళ్లం.. ఆ మాత్రం ఆర్బాటం లేకుంటే ఎట్ల.. రెండు రకాల తాళింపులు. రెండు పచ్చళ్లు. రెండు రకాల స్వీట్లు. పప్పు, సాంబారు, రసం. వెజిటబుల్ రైస్.. పెరుగుపచ్చడి.. మొత్తం. ఇరవై రెండు రకాల ఐటంలు చేపిస్తాండాం.. ఒక్క భోజనానికే ముప్పై వేలు ఖర్చు చేస్తాండాం..'' గర్వంగా చెప్పాడు సిద్దారెడ్డి.

''ఈ లెక్కన పెండ్లికి ఎంత ఖర్చు చేస్తావునా..''

''నేను చెప్పేదేముండాది..చూస్తావు కదా..'' నవ్వతా చెప్పినాడు సిద్దారెడ్డి.

## లగ్నం

''రెండు కేజీల బెల్లం., సేమ్యా పొట్లం ఒగటి., రెండు రూపాయలకు యాలక్కాయలు., నాలుగు కేజీల జిలకర, మసూర., అరకేజీ కందిబేడలు., కేజీ పచ్చిమిరపకాయలు., కేజీ టమేటాలు., అర కేజీ వంకాయలు., రెండు రూపాయలకు కొత్తిమీర కరేపాకు., ఎర్రగడ్డలు కేజీ., తెల్లగడ్డలు., పది రూపాయలకు తమల పాకులు., పది రూపాయలకు వక్కలు., రెండు రూపాయలకు కర్పూరం., కడ్డీలు ఒక పేకెట్టు., టెంకాయలు రెండు.. ఇంతేనా.. ఇంగే మన్నా కావాల్నా'' అడిగినాడు అంగడతను.

తలబరుక్కుంటా.. ''ఇంగేమీ గెవనానికి రాలేదే.. అంతేలే..మరిసిపోతే మళ్లా వస్తాలే.. ఎందూరం.. దెగ్గిరే కదా'' అన్నాడు ఎంగటేసు.

లిస్టంతా చూస్తా ''ఏమి ఎంగటేశూ..చానా సరుకులు కొంటాండావే..'' అడిగాడు అంగడతను.

''మా బిడ్డకు లగ్నమన్నా..''

''ఎప్పుడు..''

''ఈ పొద్దేనా..సందేళ..''

''మాకు చెప్పలేదే..''

''రండినా..ఇంట్లో అందురూ వచ్చేయండినా'' నవ్వుతా చెప్పినాడు ఎంగటేశు.

''పందినమ్మినావా..దుడ్డేడిది?''

''నూటికి ఇన్నూటికి పందిని అమ్మతామా.. సిద్దారెడ్డన్న దెగ్గర రెండు నూర్లు తెచ్చినా''

''నూటతొంభై రెండు రూపాయలయిండాది. రెండు రూపాయలు తోసేసి నూటతొంభై ఈ'' అంటా సరుకులన్నీ సంచిలో పెట్టి ఇచ్చాడు అంగడతను.

డబ్బులు ఇచ్చేసి, సరుకులు తీసుకుని ఇంటికి వచ్చేప్పటికి సమయం ఎనిమిది గంటలు.

ఇంటి ముందు పేడతో అలికి ముగ్గు ఏస్తాండే కోటమ్మ ''సామాన్లు తెచ్చేదానికి ఇయ్యరవ పట్టిందా.. బిన్నే వచ్చెంటేనే మి.. పొద్దెగబడతాండ్లా.. అన్నాలు కూరలు ఎప్పుడు చేసేది'' అరిచింది ఎంగటేశును.

''ఏం చేసేదే..తెల్లార్లేలకు అంగళ్ళు తీయద్దా.. నిన్న రెడ్డి పొద్దుగూంకముందే ఇచ్చింటే నిన్ననే తెచ్చేసిందు..బిన్నే చెయ్యండి..పాప యాడా'' అంటా సరుకుల సంచి ఇంట్లోపెట్టినాడు.

''పాప నీళ్లకు పోయిండాదిలే.. రెండు శేర్ల బియ్యం తీసి కుండలో నానెయ్యి..వస్తాండా.. ముగ్గేసేసినా..'' అంది కోటమ్మ..

''నేను పొయ్యికాడ కుచ్చొంటే పందల ఎల్లతోలద్దా..''

''సిద్దప్ప తోలకపోయిండాడులే..కిట్టమ్మా.. కిట్టమ్మా..మీ మామ సామాన్లు తెచ్చిండాడు. రామ్మే..'' అంటా కేకేసింది కోటమ్మ.

సంచిలోనించీ సరుకులన్నీ బయటకు తీశాడు ఎంగటేశు. బియ్యం పావుతో కొలత పెట్టి చేటలో వేశాడు.

''బియ్యం చానా బాగుండాయే.. ఎంతమామా కేజీ'' అడిగింది కిట్టమ్మ.

''ఎంతోమ్మే.. అన్నీ రెండు నూర్లయినాయి..''

''ఏమన్నా కొనేటిగా ఉండాయా..ఏం కూర చేద్దాంకా..''

ముగ్గులు వేసేసి చేతులు చీరకు తుడుచుకుంటా వచ్చింది కోటమ్మ.

''వంకాయలు, కంది బేడలు యేసి పుల్లగూర చేసుకుందా.. బెల్లం తెచ్చిండా. పరమాన్నం చేద్దాం. చారు చేద్దాం..'' అన్నాడు ఎంగటేశు.

అందరూ వంట పనిలో మునిగిపోయారు.

పీలేరు పట్టణానికి కిలోమీటరు దూరంలో ఆగ్నేయ మూలగా నాలుగు గుడిసెలు ఉండాయి. గుడిసెలు కట్టింతర్వాత సున్నం కొట్టినట్టే లేదు. వర్షానికి చూరునుంచి కారిన నీళ్లు గోడలమీద పడ్డంతో పన్న కాలవల మాదిరిగా గీతలుండాయి. పైకప్పులు వేసి చాలాకాలమయింది అనేదానికి గుర్తుగా రంగు వెలసిపోయి నల్లగా ఉండాయి. అది గరుగు నేల కావడంతో పచ్చదనం తక్కువగా ఉంది. అక్కడక్కడా తంగేడు, జిల్లేడు చెట్లు కనిపిస్తా

## ఫర్జానా కామెడీ

కొన్ని పాత్రలను కొందరు నటిస్తుంటే వాటి కోసమే వారు పుట్టారా? అని అనిపిస్తుంది. మనకు కామెడీ హీరోలు వున్నారు కానీ కామెడీ హీరోయిన్లు దాదాపుగా లేరనే చెప్పుకోవచ్చు. ఆ కొరతను ఫర్జానా తీరుస్తుందని పరిశీలకులు అంటున్నారు. 'సీమ శాస్త్రి'లో నటించిన ఫర్జానా ఆతరువాత అదే తరహాలో 'గజిబిజి'లో నటిస్తోంది. సీమశాస్త్రిలాగానే గజిబిజి కూడా పూర్తి వినోదాత్మక చిత్రం. ఈ చిత్రం మీద ఫర్జానా చాలా ఆశలే పెట్టుకుంది. ఈ చిత్రం తనను ఓ స్థాయికి తీసుకువెళతుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేస్తోంది. ముంబాయిలో పుట్టి పెరిగిన ఫర్జానాకు మొదట అసలు నటనంటే ఇష్టం వుండేదికాదట. చదువుకుంటూనే పార్ట్‌టైం మోడలింగ్ చేసేదిట. బాలీవుడ్‌లో సంజయ్‌దత్, జాన్ అబ్రహం సరసన ఓ పాటలో సరదాగా నటించింది. ఆతరువాత బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి వచ్చింది. తాను కేవలం కామెడీకే పరిమితం కావాలనుకోవడం లేదు అంటోంది ఈ



ముంబాయి చిన్నది. అవకాశం వస్తే అన్నిరకాల పాత్రలు పోషించాలన్నది ఈమె కోరిక. ఫర్జానా ఆశ నెరవేరాలని ఆశిద్దాం.

ఉండాయి. దూరంగా నాలుగు పందలదొడ్లు ఉన్నాయి. వాటిల్లోనుంచి ఒకరకమైన మదపు వాసన వస్తా ఉంది. రెండు వాటిల్లో పిల్లలపందులు కళ్ళు మూసుకుని పడుకోనుండాయి. పిల్లలు వాటిపొల్లల కింద దూరి పాలు తాగతాండాయి.

ఎంగటేశు ఇంటివద్ద, మిగిలిన రెండిళ్ళలో ఆడవాళ్లు కూడా వచ్చి చేరారు. అందరూ కలసి వంటపనులు చేస్తాండారు.

ఇంటి ముందు చింపిరి జుట్టులో, బట్టల్లేకుండా ఉండే పిల్లలు ముగ్గురు ఆటలు మొదలు పెట్టారు.

''రేయ్.. దూరంగా పొయ్యి ఆడుకోపోండి.. ముగ్గు పోతాది'' అరిచింది కోటమ్మ.

''ఇనాం ఎంతిస్తాండారుకా'' అడిగింది కిట్టమ్మ.

''చానా ఎక్కవమ్మా.. మీమామనే అడుగు..''

''ఎంతమామా..''

''పది పందులు.. పాపకు కమ్మతట్లు, ముక్కు పుల్ల, కాళ్లగొలుసులు.. పిల్లోనికి వాచి, కాళ్లకు చెప్పులు..పెండ్లి మనం చేసీయాల''

''పది పందులా..చానా ఎక్కువ కదా మామా'' అంది కిట్టమ్మ.

''ఏంచేసేదిమ్మే.. వోళ్లు ఇరవై పందులు అడిగినారు..గోజాడి గోజాడి.. పది పందులకు ఒప్పందం అయిుండాది. పిల్లోనికి ఉంగరం తీసీమని అడిగినారు. యాడవుతాది.. ఆడికే బరువు'' చెప్పి నాడు ఎంగటేశు.

''వోళ్లకు ఎన్నుండాయి జీవాలు..''

''మనకంటే ఉండేవోళ్లే.. ఇద్దురు కూతుండ్లు.. ముగ్గురు కొడుకులు.. ఈ పిల్లోడు కడా.. మిగిలి నోళ్లంతా ఎవరి బతుకు వోళ్లు బతుక్కుంటా ఉండారు. పిల్లోడు అమ్మానాయనతో కలిసుండాడు. రెండు సుట్టిండ్లు ఉండాయి. నలభై జీవాలుండాయి..''

''మ్మేయ్..లచ్చిమీ..నీళ్లు చాల్లే.. నీళ్లు కాగిండాయి. పోసుకోపో'' అరిచింది కోటమ్మ.

మాటలు చెప్పుకుంటా, ఇంటి ముందు పొయ్యిల దగ్గర వంటపనిలో మునిగిపోయారందరూ.. పెంపుడు కుక్కలు రెండు తోకూపుకుంటా వాళ్ల సుట్టకారం తిరగతాండాయి.

***

## పెండ్లి పనులు

''అమ్మా.. రెడ్డి ఉండాడా..'' అడిగినాడు ఎంగటేశు ద్వారబంధం వద్ద నిలబడుకుని.

''పానుకోనుండాడు ఎంగటేశూ.. ఏం పనీ'' అడిగింది పద్మావతమ్మ చీరలు చూస్తూ.. ఆమెతో పాటు మరో పదిమంది ఆడవాళ్లు చీరలు చూస్తున్నారు.

వచ్చిన కారణం చెప్పదామా, వద్దా అన్నట్టు కాసేపు చూసి మౌనంగా ఉండిపోయాడు ఎంగటేశు. అతని ఉనికినే మరచిపోయినట్టు ఆడవాళ్లు చీరలను చూడడంలో మునిగిపోయారు.

''ఈ చీర ఎంతక్కా''

''అదా.. ఆరువేలు..''

''ఇదీ..''

''ఎర్రంచుచీర కదా.. కొత్తగా వచ్చిందంట.. పాపకు రిసెప్షన్ కోసమని తీసుకున్నేం..పదివేలు..''

''పెండ్లి పట్టుచీర ఎంత''

''అదో.. ఆపక్కనుండాదే వక్కరంగు చీర.. అదే.. యాభైవేలు..''

''యాభై వేలా..!''

''పెండ్లి గుడ్డలు అన్నీ ఎంతయినాయమ్మా''

''పాపకు, పిల్లోనికి, వాళ్ల అత్తామామకు, మా ఆడబిడ్డలకు, వాళ్ల మొగుళ్లకు..ఇంగా ఎవురెవురికో.. ఒగ లోడనుకో ఒదినా..అన్నీ కలిపి ఆరులక్షలు దాటింటాయి''

''ఓయమ్మా.. అంతయినాయా..''

''మేము పది లక్షలు అయితాయనుకోనున్నేం.. బెంగుళూరులో మా రెడ్డికి తెలిసినోళ్లది అంగడి. బాగా తగ్గించి యిచ్చినారు..'' చేతులు తిప్పుతా వివరిస్తా ఉంది పద్మావతమ్మ.

''సిద్ధారెడ్డి ఉండాడామ్మా..''

''ఆ..రా చిన్నాయనా..కుచ్చో..మేయ్ శ్రీదేవీ.. పైకి పొయ్యి, రెడ్డికి క్రిష్ణారెడ్డన్న వచ్చినాడని చెప్పు'' చెప్పింది పద్మావతమ్మ.

ఆడవాళ్లందరూ సోఫాల్లో, కుర్చీల్లో కూర్చుని చీరలు చూస్తుండటంతో నిలబడుకున్నాడు క్రిష్ణారెడ్డి. మరో రెండు నిముషాల్లో బనియన్, పంచెతో మెట్లు దిగాడు సిద్ధారెడ్డి.

''ఏం మామా నిలబడుకోనే ఉండావే.. ఓహో.. ఆడోళ్లంతా చీరలు చూస్తాండారా..'' అని నవ్వి.. ''మనం తోటలో కుచ్చోందాం పదా.. నువ్వెప్పు డొచ్చినావు ఎంగటేశూ.. వరండాలోటియి రెండు కుర్చీలు తే'' అన్నాడు సిద్ధారెడ్డి.

ఇద్దరూ తోటలోకి వచ్చి ఎంగటేశు వేసిన కుర్చీల్లో కూర్చున్నారు. వాళ్లకు దగ్గరలో పచ్చికమీద పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు ఎంగటేశు.

సాయంకాలం కావస్తా ఉంది. పగలుకాసిన ఎండకు గాలి ఇంకా వెచ్చగానే వీస్తా ఉంది.

''మధ్యాన్నం వచ్చినాం..'' అన్నాడు చెప్పబోయే మాటలకు ఉపోద్ఘాతంగా సిద్ధారెడ్డి.

''నేను వారం రోజులు ఊర్లోలేనుకదా సిద్ధారెడ్డీ.. ఈరోజే వచ్చినా.. పెండ్లి పనులు ఎందాకా వచ్చి నాయో కనుక్కుందామని వస్తిలే'' అన్నాడు క్రిష్ణారెడ్డి.

కుర్చీలో వెనక్కు వాలి నోరంతా తెరిచి ఆవులించాడు సిద్ధారెడ్డి. ''నిన్న పోయినాం బెంగ ళూరుకు.. ఆడ చూసినావుకదా, మీ కూతురు అయిుండాది. మళ్లా పిల్లోనికి గుడ్డలు వాళ్లే కుట్టించు కుంటామంటే ఇరవై వేలు ఇచ్చినాం..''

ఎంగటేశు తాను వచ్చిన పని మరచిపోయాడు. సిద్ధారెడ్డి చెప్పేమాటలు నోరు తెరుసుకోని వింటా ఉండాడు. సిద్ధారెడ్డి కూడా మధ్యమధ్యలో ఎంగటేశు వైపు చూస్తా ఉండాడు, వింటాండాడా లేదా అన్నట్టు.

''పెండ్లి ఇంట్లోనే కదా''

''ఇంట్లో యాడ చేస్తాం.. సరిపోతాదా.. మన తాహతుకు ఈ ఇల్లు చాలదులే.. ఎంతమంది.. కనీసం రెండు వేలమందన్నా వస్తారనుకుంటా ఉండా..అందుకనే ముఖ్యమయినోళ్లందరికీ పెండ్లి రోజుకు పీలేర్లో లాడ్జీలన్నీ ముందుగానే బుక్ చేసేసినాం.. ఏటిదగ్గరుండాదే., కళ్యాణమండపం దాంట్లో పెండ్లి''

''టౌనుకు దూరం కదా''

''బండ్లు లేనోళ్లకు ఇబ్బంది. మనకేం..పది టాటా సుమోలు పెడతాండా..ఎవురికేగానీ ఏ ఇబ్బందీ ఉండగూడదు..''

''పెండ్లిపత్రికలు ఏపించేసినారా..''

''ఆర్డరిచ్చినాం.. ఒక్కో కార్డు ఇరవై రూపాయలు పడతాండాది... అందరికీ ఫోన్లు చేసి చెప్పేసినా.. ఫోన్లకే ఐదువేలదాంకా అయిుండాది.''

ఇద్దరూ మాటలు చెప్పుకుంటా ఉండారు. చీకటి పడింది. దీపాలు వెలిగాయి. మధ్యలో ఒకసారి కాఫీలు వచ్చాయి. ఇద్దరూ తాగారు.

రెండు సార్లు తను వచ్చిన విషయం అడగాలను కున్నాడు ఎంగటేశు.. కానీ అతనికి ఆ అవకాశం ఇవ్వలేదు వాళ్ళు. మాట్లాడుకుంటానే ఉండారు. ఇంటి దగ్గరనుంచి ఫోన్ రావడంతో క్రిష్ణారెడ్డి వెళ్ళిపోయాడు.

''అరే..నిన్ను మరిచే పోతినే.. ఏం ఎంగటేశూ వచ్చినావు'' అడిగాడు సిద్ధారెడ్డి.

''అదేన్నా.. ఆరోజు అడిగిన్నే కదా.. మా పాపకు పెండ్లి.. ఐదువేలు దుడ్డు కావాలన్నా..'' మెల్లగా



చెప్పాడు ఎంగటేశు.

''ఓ.. మరిచే పోయినా.. ఇంచేపూ ఇన్నేవు కదా.. లక్షలతో పని. పాప పెండ్లికి మొత్తం రెండు కోట్ల దాంకా అయ్యేటిగా ఉండాది. ఒగ రూపాయి కూడా ఈలేను''

''అట్లంటే ఎట్లనా..నిన్నే నమ్ముకోనుండా'' దీనంగా అడిగాడు ఎంగటేశు..

''ఏం చేసేది ఎంగటేశూ.. పెండ్లికి అనుకున్నె దానికన్నా ఎక్కువ ఖర్చులయితాండాయే.. నువ్వు యాడన్నా తీసుకో.. రెండునెల్లు పోయినాంక ఇస్తా..'' అన్నాడు సిద్ధారెడ్డి.

## సమాళించుకోవాల

''కడా బేరం..ఒగోదానికి రెండువేలా రెండు నూర్లు ఇస్తాంనా.. ఒగరూపాయి కూడా ఎక్కవ ఈను'' చెప్పాడు పుల్లన్న.

''ఒగోటి యబై కేజీలుంటాది.. ఎంత తక్కవన్నే నలభై కేజీలొస్తాది. కేజీకి ఎనభై లెక్కేసినా మూడువేలు పైన్నే.. ఒగొదానికి రెండువేలా ఐదు నూర్లు ఈండి'' అన్నాడు ఎంగటేశు.

''లేదన్నా.. అంత చెయ్యవులే.. ఎంత బక్కగా ఉండాయో చూడు..''

''ఏదో బిడ్డ పెండ్లిపెట్టుకోనుండాడు.. అవసరం అనిగదా అమ్మతాండాడు. ఇట్ల అడిగితే ఎట్ల..'' మధ్యలో కలగజేసుకున్నాడు నారప్ప.

అందరూ ఎంగటేశు పందల దొడ్డికాడ నిలబడు కోనుండారు. మూడు పందులు మాత్రమే దొడ్లో ఉండాయి. మిగిలిన వాటిని లచ్చిమి మేపేదానికి తోలుకోని పోయిండాది.

''మాకూ బిడ్డలుండారునా.. మేమేం అన్నేయంగా అడగలా..ఇంగోనూరు ఎగేసి ఇస్తాం. మొత్తం ఆరువేలా తొమ్మిది నూర్లు'' అన్నాడు పుల్లన్న.

అప్పటికి చూస్తా ఉండిపోయాడు ఎంగటేశు..

''సరేలేప్పా. ఇంగోనూరు ఎగేసి ఏడువేలు ఇచ్చేయండి'' బేరం తెంచేసాడు నారప్ప.

''సెంచికారం మూడునూర్లు పెట్టుకో..రేపు వచ్చి మిగతాది ఇస్తాం..'' అన్నాడు పుల్లన్న.

''మేము తిరపతికి గుడ్డలకు పోవాల''

''మీరు నిద్దరలెయ్యక ముందే వచ్చి ఇచ్చేసి పోతా..'' అన్నాడు పుల్లన్న.

మూడు పందులను తోలుకోని పోయి, పుల్లన్న వాళ్ల ఊరి దగ్గర వదిలి వచ్చాడు ఎంగటేశు. అప్పటికి పొద్దు గూట్లో పడింది. గరుకునేలమీద నుంచి ఇంకా వేడి సెగలు వస్తానే ఉండాయి. ఇంటిగోడలకుండే దుంకలకు కోటమ్మ మన్ను మొత్తతా ఉండాది.

''మూడు పందలను అమ్మేస్తివి..ఇనాం పది పందులు ఇస్తాండావు. ఏడు పందులే కదా మామా మీకుండేది. ఎట్ల మీ జీవనం..'' అడిగింది కిట్టమ్మ.

''బిడ్డకన్నా ముక్కెమామ్మే..ఆ బగమంతుడు ఒగబిడ్డనే ఇచ్చినాడు. ఇంగో నలుగుర్ని ఇచ్చింటే ఎట్ల చేసిందుమో'' అన్నాడు.

''ఇంటి కప్పు పోయిండాది. వానొస్తే కారతాంది. ఇంట్లోపడుకున్నేమంటే ఎన్నెలంగా ఇంట్లోనే ఉంటాది.. కప్పడం ఏస్తే బాగుండు మామా'' అంది కోటమ్మ.

''ఎండలకాలమేకదామ్మే.. వానల కాలం కాదులే.. బిడ్డ పెండ్లి కానీ.. మళ్ల చూసుకుందా..'' అన్నాడు ఎంగటేశు.

పద్దన్నే తిరుపతికి పోయి పెండ్లికి ఏమేం తీసుకోవాల్లో లెక్కలేశారు.

పెండ్లి కూతురుకు నూటేభైలో నాలుగు చీరలు, నాలుగు నూర్లలో పెండ్లి చీర, రెండు గ్రాముల్లో కమ్మలు, రెండు నూర్లలో ముక్కుపుల్ల, ఐదునూర్లలో కాళ్లగొలుసులు..పిల్లోనికి నాలుగు నూర్లలో పంచె చొక్కాయి, నూర్రూపయల్లో చెప్పులు, ఐదునూర్లలో వాచీ, పిల్లోని అమ్మానాయనకు నాలుగు నూర్లలో గుడ్డలు, తమకు ఆలూమగలకు మూడు నూర్లలో గుడ్డలు..తీసుకోవాలనుకున్నారు.

రాత్రి తొమ్మిది గంటలు దాటిందాకా అక్కడ ఉండే నాలుగు ఇండ్లలో వాళ్లందరూ కుచ్చోని లెక్కలు వేశారు. బట్టలు, నగలవరకే ఆరువేల రూపాయలు అవుతుందనుకున్నారు. పెండ్లికి కనీసం యాభై మందికి భోజనాలు. ఐదునూర్లన్నా అవుతాదను కున్నారు. అన్నీ గుట్టుగా చేసుకుంటే పందల అమ్మిండే డబ్బుతో సరిపెట్టుకోవచ్చు అనుకున్నారు.

అంతకూ చాలకపోతే తలా నూరు రూపాయలు ఇస్తామని చెప్పినారు. ఎట్లోగట్లా సమాళించు కుందాంలే అని ధైర్యం చెప్పారు.

***

## పెండ్లి

''నీక్కావలసింది .. నాదగ్గర ఉందీ..'' పాటను భజంత్రీలు వాయిస్తున్నారు. కళ్యాణమండపమంతా ఉత్సాహంగా ఉంది. పట్టు చీరలు తళతళలాడు తున్నాయి. బంగారు నగలు ధగధగ మెరుస్తాండాయి. రిసెప్షన్‌లో ఖరీదయిన బట్టల్లో శశికళ, కార్తీక్‌రెడ్డి వెలిగిపోతాండారు. శశికళ వంటినిండా బంగారమే. ఊరేగింపుకు తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహంలా ఉందామె. కార్తీక్ రెడ్డికి ఒక్కో చేతికి నాలుగేసి ఉంగరాలున్నాయి. కుడి చేతికి వెడల్పాటి బ్రాస్‌లైట్. మెడలో చిటికెన వేలు లావున్న బంగారు చైను. పూలహారం వేలాడుతుండటంతో చైను సరిగా కనిపించడం లేదు. ఉక్కపోత నెపంతో అంతకంతకూ దండను పక్కకు జరిపి, చైనును కనిపించేలా లాగు తున్నాడు. బంధువులు జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగా వేదికపైకి వచ్చి కానుకలు ఇచ్చి ఫోటోలు దిగుతున్నారు. వాళ్లతోపాటు సిద్ధా రెడ్డి, పద్మావతమ్మ కూడా ఉన్నారు.

రాత్రి ఎనిమిది గంటలు..

భోజనం సందడిగా ఉంది. బఫే పద్ధతి ఏర్పాటు చేశారు.

ఐదురకాల స్వీట్లు. ఐదు రకాల వేపుళ్ళు. ఐదురకాల పచ్చళ్లు. రెండు రకాల పప్పు. రెండు రకాల సాంబారు. రెండు రకాల రసం. ఐదు రకాల అన్నాలు. నాలుగురకాల ఐస్‌క్రీంలు.. అరటి పండు..

''అన్నీ రుచి చూసినావారా'' అడిగినాడు క్రిష్ణారెడ్డి.

''యాడమామా చూసేది.. ఏది నోట్లో పెట్టుకున్నే రుచిగానే ఉండాది. రుచిగా ఉంటే తక్కువ తింటామా.. నాలుగైదు రకాలు తింటానే కడుపు నిండిపాయ'' అన్నాడు భుక్తాయాసంతో నాగిరెడ్డి.

ఇద్దరూ భోంచేసి వచ్చి, తాంబూలం నములుతా కుర్చీల్లో కూర్చోనుండారు.

''మనపెండ్లిడ్లప్పుడు ఇయ్యన్నీ ఉన్నేయంటరా.. పప్పన్నం, లడ్డు పెడితే చాలనుకుంటా ఉండిరి.. పెండ్లంటే పప్పన్నం లడ్డేకదా..''

''ఈడ లడ్డు యాడుంది మామా..అయ్యేంటి యేంటియే.. తీపుయి ఉండాయి. నేను మైసూర్ పాక్ తిన్నేనంతే''


''నేను గూడా అంతేలేరా..''

''మామా.. ఈడ తినేదానికన్నా బీటికి పారేసేదే ఎక్కువుండాదే'' క్రిష్ణారెడ్డి చెవిలో రహస్యం చెప్పి నట్టుగా గుసగుసగా చెప్పినాడు నాగిరెడ్డి.

''ఈడ తినకుండా పారేస్తాండేదాంతో సుమారు పాటి పెండ్లిచేయచ్చు కదా'' ఔనన్నట్టు తల ఊపినాడు నాగిరెడ్డి.

''ఆ మద్దెన యానాదోళ్ల ఎంగటేశుగాడు ఐదు వేలు దుడ్డు అడిగిన్నేడంట.. వాని కూతురు పెండ్లంట కదా.. సిద్దారెడ్డి ఇస్తానని చెప్పి ఈలేదురా.. ఇంత నేలపాలు చేసేదానికన్నా వోనికి దుడ్డు ఇచ్చింటే జీవితాంతం రుణపడి ఉన్నిండుకదా''

''మళ్ల పిల్లంపి వోని కూతురి పెండ్లికని ఇనాంగా



## ఓలేటి శ్రీనివాస భాను

# పొగబండి కథలు

## వచ్చేవారం నుంచే...



వెయ్యి రూపాయలు ఇచ్చినాడు మామా.. నువ్వు చూసినావోలేదో.. వారంనుంచీ సిద్దారెడ్డన్న ఇంటికాడ వోడు గొడ్డుమాదిరిగా పనులు చేస్తాండాడు''

''పిల్లికి కూడా బిచ్చమెయ్యడే..వెయ్యి రూపాయలు ఎందుకిచ్చినాడు!'' ఆశ్చర్యపోయాడు క్రిష్ణారెడ్డి.

''అదంతా వేరే కతలే..చూడు..చూడు..'' అంటా వేదికపైకి చూపించాడు నాగిరెడ్డి.

ఇద్దరు రాష్ట్ర మంత్రులు వచ్చారు. వాళ్లతో ఫోటోలు దిగాడు సిద్దారెడ్డి. దగ్గరుండి వాళ్ళను కుర్చీలో కూర్చోబెట్టి భోజనం పెట్టించాడు. వాళ్లతో పాటు కార్లదాకా వచ్చి సాగనంపాడు. ఎంపీ, ఎమ్మెల్యేలు వచ్చారు. చిన్నాచితకా నాయకులూ వస్తాండారు.

''ఏందిరా కత'' అన్నాడు క్రిష్ణారెడ్డి.

''ఈసారి పీలేరు ఎంపీపి టిక్కెట్టు కోసం చూస్తాండాడంట మామా..''

''ఆఁ హా.. అందుకా ఇంత ఆగింతం చేస్తాండేది..''

''ఈన్నే కుచ్చోనుంటారా.. ఇండ్లకు వస్తారా'' అంటా వచ్చింది నాగిరెడ్డి భార్య.

''పెండ్లికూతురు ఎన కంటీ ఉండవామ్మా'' అన్నాడు క్రిష్ణారెడ్డి.

''పెండ్లికూతురుతో మనకేంపని చిన్నాయనా.. ఇదేమన్నా ముందుకాలమా..తల దువ్వాల, జడెయ్యాల, పూలు పెట్టాల, చీర కట్టాల అనేదానికి ఐదువేలంట.. పోదాం పాండి ఇంటికి..'' అంది తీస్కారంగా.

క్రిష్ణారెడ్డి, నాగిరెడ్డి కుర్చీల్లోంచి లేచి మండపంలోంచి బయటకు వచ్చారు. బయట ఆర్కెస్ట్రా వాళ్ల పాటలతో చెవులు హోరెత్తి పోతాండాయి.

కళ్యాణమండపం నుంచి రోడ్డు పొడవుకూ కార్లు, బైకులు నిలిపి ఉండాయి.

### ముడి

''ముగ్గుకర్ర బాగా ఎయ్యాల..'' అన్నాడు నారప్ప..

''ముగ్గుకర్ర ఎయ్యడమంటే పందల మేపినట్టుకాదు..'' అనింది ముగ్గేసేది ఆపేసి కిట్టమ్మ.

ఆమాటలకు ఆడోళ్లంతా కిసక్కన నవ్వినారు.

ఎంగటేశు ఇంటి ముందు పేడతో ఆలికిండారు. ముందురోజు బంధువులు ఐదారుమంది వచ్చినారు. అందరూ తెల్లవారేలకు నిద్రలేచి పెండ్లిపనుల్లో ఉండారు.

ఆడవాళ్లంతా ఇంటిముందు పేడతో ఆలికి ముగ్గులు పెడతాండారు. సుట్టింటికి ముందురోజు సున్నపూశారు. ఎర్రమట్టితో బొట్లు పెట్టినారు. ఇంటికి పది బారల దూరంలో మట్టిలో గుంతలు తవ్వి పొయ్యిలు తయారు చేసినారు. పెళ్ళికూతురు స్నానం చేయడం కోసం బందారుమండలతో పెరడు తయారు చేసినారు.

''అలికి ముగ్గులేసేసినాం.. ఇంగ స్నానాలు చేసేసి అన్నాలు చేసేదే..మొగోళ్లంతా ఇంగా ఈన్నే నీలుకొన్ని ఉండారే..ఎలబారి పోయి మామిడాకులు, నేరేడు మండలు, టెంకాయపట్టలు కొట్టుకోని రాపోండి'' అరిచినారు ఆడోళ్ళు.

ముందురోజే ఎంగటేశు సిద్దారెడ్డి ఇంటిదగ్గరనుంచి పందిరికోసం అని గుంజలు తీసుకొనొచ్చినాడు. నారప్ప, ఎంగటేశు కలసి గుడిసెలకు పడమరగా నేలను సదరం చేసిండారు.

''నేరేడు చెట్టు దేవత. ఆ చెట్టెక్కేవోల్లు నీళ్లుపోసుకోని పోండి'' అరిచింది కిట్టమ్మ పోతాండే మొగోళ్లను.

''అందరమూ నీళ్లపోసుకోనుండాంలేమ్మే..'' అన్నాడు ఎంగటేశు.

పీలేరుకు అనుకోని పోతాండే ఏటితావకు పోయినారు. నేరేడు చెట్టు మొదులుకాడ కడ్డీలు వెలిగించి టెంకాయ కొట్టి, చెట్టు ఎక్కినాడు ఎంగటేశు. నేరేడు మండలు కొట్టినాడు. పక్కనే ఉండదే మామిడి తోటలో, కాపలా ఉండే ఆయనను అడిగి మామిడి మండలు కొన్ని తీసుకున్నేరు. రెడ్డేరి బాయికాడికి పోయి టెంకాయ మట్టలు పది కొట్టినారు. వాటిని తీసుకోని ఇంటికి వచ్చినారు.

సదరం చేసిండే తావన గడ్డపారతో తవ్వి నాలుగు గుంజలు పాతి పందిరేసినారు. పందిరి మింద ఆరు టెంకాయపట్టలు ఏసినారు. నాలుగు గుంజలకు నాలుగు నాలుగు టెంకాయపట్టలు చుట్టినారు. పందిరికింద తూర్పుమొగంతో ఉండేటిగా నాలుగు రాళ్లు నిలబెట్టినారు.

''ఎందుకుమామా ఎదవా.. సీత, రాములు, లచ్మణుడు, ఆంజనేయసోమి. చెంపలేసుకో'' అన్నాడు నారప్ప.

పెళ్ళికి వేదిక సిద్ధమయింది. అన్నం, కూరలు, పరమాన్నం చేసేసినారు. దగ్గర్లో ఉండే మర్రిచెట్టు నుంచి ఆకులు కోసుకోనొచ్చి విస్తర్లు కుట్టినారు. లచ్చిమికి స్నానం చేసించి కొత్తబట్టలు కట్టి, తల దువ్వినారు.

ఆరోజు పందలను ఎల్లదోలలా. అన్నీ దొడ్లలోనే ఉండాయి. పిల్లోల్లు, ఆడోల్లు మొగోళ్లు అందరూ అన్నే ఉండారు.

పనులన్నీ అయిపోయి పెండ్లి కొడుకు కోసరం కాసుకోనుండారు. ఇంతలో ఇద్దరు పోయి మెల్లగా గుడిసెలో కుండలోనించీ రెండు గ్లాసులు సారా తాగేసి వచ్చి డప్పులు ఎత్తుకున్నేదు. డప్పులు వాయిస్తాంటే మిగిలినోళ్లు ఎగరతా ఉండారు. మధ్యాహ్ననికంతా పెండ్లికొడుకు బృందం వచ్చింది.

భోజనాలయినాంక సాయంకాలం నాలుగు గంటలకంతా లచ్చిమిని, అక్కులప్పను పెండ్లిపీటల మింద కుచ్చోపెట్టినారు.

''మేము పాలూనీళ్ల మాదిరిగా కలిసుంటాం..

ఒగరికోసరం ఒగరం బతకతాం..
రంపలాడుకోం..
సంసారం గుట్టు ఈదిన ఏసుకోం..
ఎల్లురిచ్చే సూర్యబగమానుడి సాచ్చిగా.,
ఎన్నెలిచ్చే సందమామ సాచ్చిగా.,
బువ్వపెట్టే బూమాత సాచ్చిగా.,
ఆ చుక్కల సాచ్చిగా.,
మమ్మల్ను కన్న అమ్మాఅమ్మ సాచ్చిగా..

మేమిద్దరం సచ్చేదాంకా ఒగర్ని ఒదిలి ఒగరం ఉండం..'' అని కుల పెద్ద చెప్తాంటే లచ్చిమి, అక్కులప్ప వంతపాడతా ప్రమాణం చేశారు.

''మంతరాలు అయిపాయ.. బొట్టు కట్టు'' అన్నాడు కులపెద్ద నొగతా.

పసుపుకొమ్ము కట్టిండే దారం తీసుకుని లచ్చిమి మెడలో మూడుముడులు వేసినాడు అక్కులప్ప.

ఇద్దరూ పూలదండలు మార్చుకున్నేరు.

''మీ ఇద్దరికీ ముడేసేసినాం.. ఒగింటోళ్లయి పోతిరి'' అన్నాడు కులపెద్ద.

డప్పులమోత ఆకాశాన్నంటతా ఉండాది.

సారా వాసన గుప్పుమంటా ఉండాది.

***

## హనీమూన్

సోఫాలో ఒకరిలో ఒకరున్నట్టుగా కూర్చోనుండారు శశికళ, కార్తీక్‌రెడ్డి. ఇద్దరి ముఖంలో పెళ్లి, శోభనం తెచ్చిన ఆనందం కనిపిస్తా ఉంది. ఎదురుగా టీవీలో ఏదో కార్యక్రమం ప్రసారం అవుతోంది. ఆ కార్య క్రమం ఏమిటో అందులో ఎవరున్నారో చూసుకునే ధ్యాసలో ఆ జంటలేదు.

పెళ్ళికి వచ్చిన బంధువులందరూ వెళ్లిపోవడంతో ఇల్లంతా బోసిగా ఉంది.

పొడి దగ్గు దగ్గతా సిద్ధారెడ్డి మెట్లు దిగాడు.

శశికళ, కార్తీక్ రెడ్డి కాస్త దూరం జరిగి కూర్చున్నారు.

''ఏమల్లుడూ, ఏవూరు పోతారు'' అడిగాడు సోఫాలో కూర్చుంటూ సిద్ధారెడ్డి.

''ఏందుకులే మామా.. టైమూ తక్కువుండాది. మల్లా అమెరికా పోవాల కదా'' అన్నాడు కార్తీక్ రెడ్డి.

''ఇంగారెండు నెలలు ఉండారి కదా అల్లుడూ''

''ఔనా'' అంటూ భార్యవైపు చూశాడు కార్తీక్‌రెడ్డి.

''పోయిరాండి అల్లుడూ.. జాలీగా వుండండి.. ఇక్కడుంటే ఇట్ల పానకంలో పుడకల్లాగా మేము ఎవురో ఒగరం మీ మద్దెలో వచ్చి దూరతానే ఉంటాం. అక్కడయతే మీరిద్దరేకదా..మీయిష్టం..''

''పోదాం పదండీ..కనీసం ఒక వారం రోజులన్నా ఉందాం..''

సరే అన్నట్టుగా సిగ్గుపడుతూ తల ఊపాడు కార్తీక్‌రెడ్డి.

''ఏవూరు పోతారు..వూటీనా..''

''వద్దునాన్నా..మేము టూర్ పోయాము.. కేరళ..'' అంది శశికళ.

''ఏమల్లుడూ..''

సరే అన్నట్టు తల ఊపాడు కార్తీక్‌రెడ్డి.

అన్నింటికీ తలవూపుతున్న అల్లుడిని చూసి నవ్వుకున్నాడు సిద్ధారెడ్డి.



## జెనీలియాకు అమితాబ్ ప్రశంసల జల్లు

'బాయ్స్' ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, బొమ్మరిల్లు వారికి దగ్గరైన జెనీలియాకు బాలీవుడ్‌లో అవకాశాల మీద అవకాశాలు వస్తున్నాయి. 'జానే దో' హిట్ తరువాత జెనీలియా తన రెమ్యూనరేషన్ పెంచేస్తుందని బాలీవుడ్‌లో అందరూ అనుకున్నారు. ఒక్క సినిమా హిట్ అయినంత మాత్రాన రెమ్యునరేషన్ పెంచేయడానికి నేనేం పెద్ద యాక్టర్‌ని కాదని కొట్టి పారేస్తోంది. జానేదో హిట్ కన్నా మరిచి పోలేనిది మరొకటి వుంది. అమితాబ్ నన్ను ప్రశంసించడం. 'జానే దో' ప్రీమియర్ షో చూసిన అమితాబ్‌జీ నన్ను అభినందిస్తూ ఇంటికి పూల బొకే పంపించారు. షూటింగ్ నుంచి ఇంటికి రాగానే పూలబొకే చూసి ముందు ఆశ్చర్యపోయాను. తరువాత దాని మీద వున్న ప్రశంసల కార్డు చూసి మైమరిచి పోయాను. అమితాబ్ లాంటి వ్యక్తి నన్ను మెచ్చుకుంటూ బొకే పంపడం మరిచి పోలేని అనుభూతి అంటోంది.

''ఏది చేసినా మన ప్రిస్టేజీకీ తగినట్టుగా ఉండాలమ్మ.. ఎంతఖర్చయినా పర్వాలేదు.. మా పాప పేరుతో లక్షరూపాయలు బేంకీలో ఏస్తా.. ఏటీఎం కార్డు ఉంది. టికెట్లన్నీ నేనే బుక్ చేపిస్తా.. జల్సా చేసుకోండి'' అన్నాడు అల్లుడిని చూస్తా.

## ఎన్నెలపందిరి

అందరూ అన్నాలు తినేసినారు. గుడిసెల ముందర కుచ్చోని మాటలు చెప్పుకుంటా ఉండారు. నారప్ప డప్పుతీసుకోని దరువేయడం మొదులు పెట్టినాడు. సిద్దయ్య నులుగెత్తుకున్నేడు.. అప్పటికే ఇద్దరూ సారా తాగిండారు.

వెన్నెల విరగకాస్తా ఉండాది. చల్లగాలి తోలతా ఉండాది. గుడిసెల్లోని మనుషులందరూ అక్కడే ఉండారు. గోడకు ఆనుకోని కుచ్చోనుండే అక్కులప్ప భుజానికి తల ఆనించి కుచ్చోనుంది లచ్చిమి.

మూడో నిద్రకు అక్కడకు వచ్చారు కొత్త దంపతులు.

ఇద్దరిలో రసాయన క్రియ జరుగుతోంది. అక్కడ ఉన్న ఆ సందడినుంచి వారు వారిద్దైన లోకంలో తేలిపోతాండారు. ఒక్కసారిగా కుక్కలు భౌభౌమని అరిచాయి. పాటలు, డప్పులు ఆగిపోయాయి. అందరూ వర్తమానంలోకి వచ్చారు. ఎవరిదో గేదె కట్టుతెంపుకోని వచ్చింది. దానిని అక్కడినుంచి అదిలించారు.

అక్కులప్ప పెద్దగా శబ్దం వచ్చేలా ఆవులించాడు.

''మ్మేయ్..లోపల చాపలేసినావా'' అన్నాడు ఎంగటేశు భార్యతో.

''ఎబ్బుడో ఏసిన్నాబ్బా..'' అంది కోటమ్మ ముసిముసిగా నవ్వుకుంటా.

''పొయ్యి పొనుకోపోండి..మాకు తెల్లార్తాదిలే..'' అన్నాడు నారప్ప.

అక్కులప్ప వెంటనే గుడిసె లోపలకు వెళ్లాడు.

గుడిసెలో కడ్డీలు వెలిగించిండారు. కింద ఈతచాప పరిసి, దానిమీద రెండు బొంతలు పరిసిండారు. తల దగ్గర ముంతలో నీళ్లుండాయి.

మరో ఐదునిముషాలకు లచ్చిమి లోపలకు వచ్చి తలుపుకు అడ్డంగా కర్ర పెట్టింది. అక్కులప్ప పక్కన పడుకుంది.

భార్యను గట్టిగా వాటేసుకున్నాడు అక్కులప్ప.

బయట డప్పుల శబ్దం తిరిగి మొదలయింది. ఈసారి నాలుగైదు డప్పులు మోగుతున్నాయి. వాటికి అనుగుణంగా పాటలుపాడతాండారు.

''ఎట్లుంది మా ఇల్లు'' గుసగుసగా అడిగింది లచ్చిమి అక్కులప్ప మీద బోర్లా పడుకుని.

భార్యముఖంలోకి చూశాడు అక్కులప్ప. చీకట్లో సరిగా కనిపించలేదు. చూరు కంతల్లోంచి వెన్నెల ఇంట్లోకి పడతా ఉంది.

''ఎన్నెలపందిరి మాదిరిగా ఉండాది'' అన్నాడు అక్కులప్ప.

లచ్చిమి కిలాకిలా నవ్వింది.

ఆమెనోటినుంచి జాలువారిన ముత్యాలను తన నోటితో అందుకున్నాడు అక్కులప్ప.

***

పల్లెచుట్టూ తిరిగే పిల్లకాలువను తనలో కలుపుకున్న వాగు పొంగి పొర్లుతోంది.. నీళ్లతో పాటు దారిపొడవుకూ ఉన్న సమస్త కల్మశాన్ని కలుపుకుని నురగలు కక్కుతోంది.. దాహం తీరక, కాలువనూ కాలువనూ కలుపుకుంటూ., నదిలా మారి ప్రపంచంలోని సమస్త జల 'సంపద'నూ తనలో ఐక్యం చేసుకోవడానికి పరవళ్లు తొక్కుతూ ఉరకలెత్తుతోంది..

*